క్లుప్తంగా

అడ్మిషన్లు ప్రారంభం

అశ్వాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సత్య ప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరే ప్రతి విద్యార్థికీ వెంటనే పాఠ్య పుస్తకాలు, 12 రాత పుస్తకాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన విద్య అందిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ఆయన కోరారు.

పట్టాలు ఇవ్వాలని వినతి

ములకలపల్లి: ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూములను సర్వే నిర్వహించి, హక్కు పత్రాలివ్వాలని కోరుతూ రాచన్నగూడెం గ్రామస్తులు సోమవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాచన్నగూడెం గ్రామశివారులోని సుమారు 586 ఎకరాల్లో 40 ఏళ్లుగా తామంతా పోడు సేద్యం చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇటీవల ప్రభుత్వం సర్వే నిర్వహించి, పట్టాలు మంజూరు చేస్తుండగా.. తమ భూములను మాత్రం నేటికీ సర్వే చేపట్టలేదని వాపోయారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్వే చేపట్టి, న్యాయం చేయాలని అభ్యర్థించారు. వినతిపత్రం అందజేసినవారిలో గ్రామస్తులు బైటి పొట్టి, కల్లూరి బజారమ్మ, కట్టం రాములు, బొగ్గం బాలమ్మ, కట్టా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కంటివైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోపి పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు అపరేషన్ చేసేందుకు వరంగల్ రిఫర్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకున్నారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు, ప్రసాద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

లోవోల్టేజీని నివారించాలి

అశ్వాపురం: మండల కేంద్రంలో కాలనీ గేట్ ఎదురుగా ఉన్న ముస్లిం కాలనీలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఎంతో కాలంగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని గతంలో ఏఈకి విన్నవించగా.. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. పిల్లర్లు నిర్మించారే తప్పా ట్రాన్స్‌ఫార్మర్ నిర్మించలేదని గ్రామస్తులు ఏఈ శ్రీనివాస్‌కు తెలిపారు. ముస్లిం కాలనీ గ్రామస్తులు షేక్ గంజిషాహిద్, శ్రీరాంరెడ్డి, ప్రతాపరెడ్డి, శబ్బార్, నయీం, యాకూబ్‌ఆలీ, అమర్, గాలిబ్, షాహిద్, అబ్దుల్ అజీజ్, యాకూబ్‌పాషా, ముస్తఫా పాల్గొన్నారు.

పోరాటంతోనే పునరుద్ధరణ

చర్ల: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ, పీడీఎస్‌యూ దశల వారీగా చేసిన పోరాట ఫలితంగానే చర్లలో విద్యాశాఖాధికారులు రద్దు చేసిన డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించారని ప్రజాపంథా చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన చర్లలో విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ పరీక్షా కేంద్రం రద్దు చేయడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమ పార్టీ, పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అధికార యంత్రాంగం డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లుగా ప్రకటించిందని తెలిపారు.

సెలవులు పొడిగించాలి

మణుగూరురూరల్: మండుతున్న ఎండల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల వేసవి సెలవులను మరో వారం రోజులు పొడిగించాలని టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా శంకర్‌నాయక్ కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో టీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బాణోత్ మధుకర్, ఉపాధ్యక్షుడు బానోత్ సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ హతిరామ్, సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

గీత కార్మికులకూ వర్తింపజేయాలి

అశ్వాపురం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతి వృత్తిదారులకు ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని గీత కార్మికులకు కూడా వర్తింపజేయాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గంగరాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులాల్లో కొన్ని కులాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకం వర్తింపజేసి గీత కార్మికులను విస్మరించడం బాధాకరమన్నారు. ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని అన్నారు.

2కే రన్ విజయవంతం

- జెండా ఊపి ప్రారంభించిన పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత



మణుగూరురూరల్: పోలీస్ రన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు



మణుగూరురూరల్: రన్‌లో పాల్గొన్న పోలీసులు, యువకులు



అశ్వారావుపేటలో 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మణుగూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ పోలీస్ 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, జెడ్పీటీసీ పోశం నరసింహారావులు జెండా ఊపి ప్రారంభించారు.

మణుగూరులోని హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన రన్ అంబేడ్కర్ సెంటర్ మీదుగా పూలమార్కెట్ సెంటర్ వరకు కొనసాగింది. రన్‌లో మణుగూరు సబ్ డివిజన్‌లోని పోలీసులతో పాటు యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. పోలీస్ వారు ఏర్పాటు చేసిన డీజే సౌండ్స్‌కు యువకులు ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ రన్‌లో సందడి చేశారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ ముత్యం రమేష్, అశ్వాపురం సీఐ సీహెచ్ శ్రీనివాస్, ఏడూళ్లబయ్యారం సీఐ రాజగోపాల్, ఎస్సైలు రాజ్‌కుమార్, బట్టా పురుషోత్తం, సముద్రాల జితేందర్, నాగుల్‌మీరాఖాన్, పోలీస్ సిబ్బంది, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

స్నాక్స్ పంపిణీ..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ 2కే రన్‌లో పాల్గొన్న వారి కోసం జిల్లా ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ భద్రాచలం వారు 1,000 బిస్కెట్ ప్యాకెట్లను పట్టణ సీఐ నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు రెపాక శ్రీనివాస్, నాళ్ల సాయిచంద్, శ్రీరామ్ సునీల్, శ్రీవాసవి ఆలయ కోశాధికారి ఇల్లందుల వెంకటేశ్వర్లు, వనమా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణే సీఎం కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సోమవారం మణుగూరులోని శివలింగాపురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండో విడత కంటివెలుగు విజయోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు కంటివెలుగు పథకం ఒక గొప్ప వరమన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలతో పాటు వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష, జిల్లా కంటివెలుగు పథక వైద్యాధికారి డాక్టర్ పర్శియా నాయక్, మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విప్ రేగా కాంతారావు

ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ.. సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత, పునరావాస గ్రామాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సంస్థ ఆధ్వర్యంలో 50మంది అభ్యర్థులకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

శిక్షణ పొందేందుకు అభ్యర్థులు 18–35 సంవత్సరాల వయసు, పదో తరగతి విద్యార్హత, హెవి గూడ్స్ డ్రైవింగ్ లైసెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ తర్వాత అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు పత్రంతో పాటు పదో తరగతి, కుల, ఆదాయ, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డ్, పీఈఎఫ్, పీఏపీ ధృవీకరణపత్రాల జిరాక్స్ ప్రతులను, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతచేసి పైలట్‌కాలనీ ఎంవీటీసీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కాగా గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మణుగూరు సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత, పునరావాస గ్రామాల యువత, సింగరేణి, మాజీ సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

దమ్మపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సోయం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ఇటీవలే ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన అఖినేపల్లి, అలిపల్లి, జమేదారు బంజర పంచాయతీ సర్పంచ్‌లను అభినందించారు. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యులు ప్రజలకు సరిన్న వైద్య సేవలను అందించాలని ప్రజా ప్రతినిధులు సూచించారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీసీ కులానికి చెందిన కులవృత్తుల వారు రాష్ట్ర ప్రభుత్వం అందించే లక్ష రూపాయల ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోయే వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలు గూరించి సర్పంచ్‌లు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, తహసీల్దార్ స్వామి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎంబీ.నర్సారెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రెవెన్యూ కాలనీ ఆనుకొని ఉన్న శ్రీలంక కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబీ.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కాలనీలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీలంక కాలనీలో అవసరమైన మేరకు విద్యుత్ స్తంభాలు లేకపోవడం వల్ల సర్వీస్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో అవి మరింత ప్రమాదకరంగా తయారయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వైవి.రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, బి.పుణ్యవతి, రౌతు గణపతి అమ్మ, పిలక శివకుమారి, రౌతు రాము, తడికల కుమారి, దేవవరం పట్టాభి, సావిత్రమ్మ, రజిని, రాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలి

అశ్వారావుపేటరూరల్: క్రీడా పోటీల్లో సత్తా చాటి, క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ వరలక్ష్మి, ఎస్సై బి.రాజేష్ కుమార్ అన్నారు. మండలంలోని నారాయణపురంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తుండగా, ఈ పోటీలను జెడ్పీటీసీ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారికి సూచనలు చేశారు. ఈ పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కంగాల పరమేశ్, బీఆర్ఎస్ నాయకులు సీహెచ్ వెంకటనరసింహం, ఆకుల శ్రీను, చందా రామారావు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎస్సై

ఉత్సవాలను విజయవంతం చేయాలి

చర్ల: తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న భద్రాచలంలో జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంసీహెచ్ పీఓ డాక్టర్ చైతన్య కోరారు. సోమవారం మండలంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో వైద్యాధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో వైద్య ఆరోగ్యశాఖ సాధించిన ప్రగతిని వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ దివ్యనయన, డాక్టర్ మోనిక, డీపీఎంఓ సీహెచ్ సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం



క్విజ్ పోటీల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వెంకటరెడ్డి

చంద్రుగొండ: కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌పై యువతీ, యువకులకు జూన్ 18న నిర్వహించే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్‌క్విజ్ కాంపిటేషన్‌పై ప్రచారరథాన్ని సోమవారం జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ప్రశ్నలతో కూడిన క్విజ్ పోటీలు ఈ నెల 18న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాలని 40 బహుమతులు ఉంటాయన్నారు. క్విజ్‌లో పాల్గొనే వారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు, సర్పంచ్‌లు పద్దం వినోద్, దారావత్ రామారావు, మాజీ సర్పంచ్ రుక్మిణి, బడుగు కృష్ణవేణి, సంకా కృపాకర్, బంగు శ్రీను, బడుగు శంకర్, దారం గోవిందరెడ్డి, అంతటి రామకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చంద్రుగొండ: నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్టపర చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీఏ అఫ్జల్‌బేగం హెచ్చరించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని విత్తన, ఎరువుల దుకాణాలను సోమవారం సాయంత్రం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, రశీదు పుస్తకాలు పరిశీలించారు. ఆమె వెంట శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం జలగం వర్ధంతి

బూర్గంపాడు: మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వర్ధంతిని సోమవారం సారపాకలో నిర్వహించారు. సారపాక ప్రధానకూడలిలోని వెంగళరావు విగ్రహానికి తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంగళరావు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కదారి మోహన్‌రావు, దామోదర్‌రెడ్డి, తన్నీరు వెంకటేశ్వర్లు, సాంబారెడ్డి, కృష్ణకుమార్, జక్కుల శ్రీనివాస్, బండి నాగేశ్వరరావు, గోపాల్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

అశ్వారావుపేట: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్వో ఎదుట ధర్నా నిర్వహించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీఆర్పీ హనుమంతుకు సమర్పించారు. కార్యక్రమంలో నాగదుర్గ, యామినీ, వెంకమ్మ, దేవి, నన్ని, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన

చర్ల: మండలంలోని జీపీపల్లిలో పంచముఖాంజనేయ స్వామి వారి మడప నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన ప్రముఖ అర్చకులు డి.రాఘవశర్మ, జి.సురేష్‌శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాస్త్రోక్తంగా సాగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో పాటు జీపీపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వేతనాలపై చర్చించండి

మణుగూరురూరల్: కార్మిక సంఘాలు, యాజమాన్యంతో నేడు జరగబోయే డీఎల్‌సీ సమావేశంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలుపై చర్చించాలని ఇఫ్టూ నాయకుడు మంగీలాల్ కోరారు. సోమవారం కేసీహెచ్‌పీలో జరిగిన సమావేశంలో మంగీలాల్ మాట్లాడుతూ.. మెరుగైన జీత భత్యాలు, వైద్యం, లాభాల వాటా వంటివి అమలు కోసం డీఎల్‌సీ వేదికగా అన్ని కార్మిక సంఘాలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులు జి.సంజీవరావు, పి.వెంకటేశ్వర్లు, టి.లక్ష్మినారాయణ, బి.కృష్ణ, లింగయ్య, నరసింహారావు, జానయ్య, రవి, చలమయ్య, ఆనందబాబు పాల్గొన్నారు

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియామకం

అశ్వారావుపేటరూరల్: జనసేన పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా డేగల రాము నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీలోని అమరావతిలో పార్టీ ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

రక్తదానంతో పునర్జన్మ..



మాట్లాడుతున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ

భద్రాచలంఅర్బన్: అమ్మ జన్మనిస్తే.. రక్తదానం పునర్జన్మనిస్తుందని భద్రాచలం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ఆరోగ్యవంతులైన యువకులు, విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ వై.రాజశేఖర్‌రెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి, సభ్యులు కుంట శివరామ కృష్ణ, కుంట శ్రీకాంత్, బాలకృష్ణ, జయరామ్, ప్రసాద్, ఏకేష్, చైతన్యరెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎంపీపీ వినతి

అశ్వాపురం: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను ఎంపీపీ ముత్తినేని సుజాత కలిసి మండలంలో పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మామిళ్లవాయి రెవెన్యూ పరిధిలోని గొందిగూడెం గ్రామ రైతుల భూసమస్యలు పరిష్కరించాలని, జూలైలో గోదావరి వరదలకు ఇళ్లు నీట మునిగి పరిహారం అందుకోలేకపోయిన బాధితులకు పరిహారం ఇప్పించాలని కోరారు. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన పడవల యజమానులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దిన్, ఎస్‌కె.ఖదీర్, గొందిగూడెం సర్పంచ్ పాయం భద్రమ్మ, గొల్లగూడెం మాజీ సర్పంచ్ పొడియం అనిల్, గొల్లపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన పసుల రాములు కుటుంబానికి సోమవారం మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఇంటిలిజెన్స్ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధీర్ పాల్గొన్నారు.

పొంగులేటి శ్రీనన్న సైన్యం ఆధ్వర్యంలో..

పసుల రాములు కుటుంబానికి పొంగులేటి శ్రీనన్న సైన్యం ఆధ్వర్యంలో సోమవారం రూ.8 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కందిమళ్ల రామిరెడ్డి, పులసాని రామిరెడ్డి, పర్వత నరేష్, రనబోతుల రామిరెడ్డి, సురేందర్‌రెడ్డి, కొమరం శ్రీను, నెహ్రూ, భార్గవ్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



మొక్కలు నాటుతున్న రెవెన్యూ, సీఆర్‌పీఎఫ్ అధికారులు

చర్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం తహసీల్దార్ బి.భరణిబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలు మానవాళి మనుగడకు ఎంతగానో దోహదపడతాయని తహసీల్దార్ బి.భరణిబాబు అన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు బహుమతి అందజేత

అశ్వారావుపేటరూరల్: టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం ఓ పూర్వ విద్యార్థి నగదు బహుమతిని అందించారు. సోమవారం స్థానిక జెడ్పీఎస్(బాలుర) పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత డిప్యూటీ జనరల్ అకౌంటెంట్ బడిపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జి.మహాలక్ష్మి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, పి.స్వాతి, ఏ.హాసిని, జి.మధుప్రియలకు ద్వితీయ బహుమతిగా ఒకొక్కరికి రూ.5వేల చొప్పున చెక్కులను అందించారు. వచ్చే ఏడాది కూడా ఇదే విధంగా తన తల్లి పుష్పావతి జ్ఞాపకార్థంగా అందిస్తానని ప్రకటించారు. హెచ్ఎం సీహెచ్ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ

చంద్రుగొండ: మండలంలోని మంగయ్యబంజర్, దుబ్బతండా, రావికంపాడు గ్రామాల్లోని పాఠశాలల్లోని విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్స్, జామెంట్రీబాక్స్, రబ్బర్, స్కేల్‌లను పాస్టర్ డి.కిషన్ సోమవారం పంపిణీ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమైన క్రమంలో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు పాస్టర్ కిషన్ తెలిపారు. కార్యక్రమంలో భోజ్యా నాయక్, హెచ్ఎంలు హరి, రాందాస్, స్టెల్లా, అశోక్, జాషువా, రత్నం, వరప్రసాద్, దానియేలు, దావీదు, చక్రి, ధర్మ, లాలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

చర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్ల పిల్లలకు కల్యాణలక్ష్మి, ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చర్లలో అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్ల పిల్లలకు రెవెన్యూ అధికారులు ఆదాయ ధ్రువపత్రాలను జారీ చేయడం లేదని ఆరోపించారు. దీనివల్ల వారి పిల్లలు సంక్షేమ పథకాలను దూరమౌతున్నారని అన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏ డ్యూటీలను బహిష్కరిస్తున్నట్లుగా తహసీల్దార్‌కు అంగన్‌వాడీ టీచర్లు నోటీస్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్యామల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.నాగమణి, కమల మనోహరి, విజయలక్ష్మి, సుజాత, సత్యావతి, భానుమతి, పుష్ప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు